# "భారతంలో కరువు" కథ

"సుబ్బన్న"

శారద పేచీపెట్టింది. రెండు చేతుల్తో తల్లిని 'తపతప' బాదేస్తున్నది. గుజ్జులాగ కలిపిన మజ్జిగన్నపు కంచం చేత్తో పట్టుకొని శారదను చంక నేసుకొని తల్లి డాబామీదికి చేరింది. ఏడ్చి చెమర్చిన శారద చల్లగాలిలో కొంత హాయి నందుకొన్నా మంకుపట్టు వదల్లేదు. తల్లి గాలిలో తలలూపే కొబ్బరిచెట్లను చూపింది. శారద తల్లి జుట్టు పట్టుకొని కదుపుతోంది. ఆమె వెన్నెల కురిపించే చందమామను చూపింది. శారద చందమామ చలువల్లో కొంత సేద దేరింది. తల్లి మెల్లిగా శారదను మాటల్లోకి దింపి కట్టుకథల్తో వశపర్చుకొంది. మధ్యమధ్య నిమ్మకాయ ఊరుబద్ద నాలిక్కి రాచుకొంటూ శారద మజ్జిగన్నం జూరుతోంది. తల్లి అన్నమంతా తినిపిస్తున్నదని తెలుసుకొని శారద మళ్ళీ ఏడుపు ప్రారంభించింది.

"ఈ కొంచెమేగా, ఊఁ, ...అన్నం పారేసుకో కూడదమ్మా ... కరువొచ్చి మనుషులంతా చస్తున్నారు. 'ఆ' బట్టమ్మా, 'ఆ' బట్టు."

కరువంటే ఏమిటో నాలుగు వసంతాల శారదకేం తెలుసు?

"అన్నం వద్దు ఫో...కరువొద్దు ఫో" అని తల్లిని తన చేతుల్తో తోసివేస్తోంది.

"మరే, శారదా! మరట, బీహారులోనే ఒకబ్బాయి ఉరిపెట్టుకొన్నాడట."

శారద ఏడుస్తూనే ప్రశ్నార్థకంగా "ఊఁ?" అన్నది.

"బీహారులో ఒకబ్బాయి గొంతుకు తాడు బిగించుకొని చెట్టునుంచి వేళ్లాడతున్నాడట."

"ఎందుకు?"

"చచ్చిపోవడానికి."

"చచ్చిపోతం ఎందుకు?"

"తినడానికి అన్నంలేక, ఆకలికి ఆగలేక ఉరి పోసుకొన్నాడట. పాపం! ఊఁ నోరుతెరు... ఆఁ ఆఁ."

శారద కొంచెంగా అన్నం మింగింది. చావంటే ఏమిటో దానికి తెలియదు కాని, భయంమాత్రం వేసింది. రెండు చేతుల్తో తల్లిని కావిలించుకొని, ఆమె మొఖంలో తన ముఖం పెట్టి ఆదుర్దాగా అడిగింది.

"చచ్చిపోయినాడా?"

"చచ్చిపోయేవాడే. ఇంతలోకే ఓ పోలీసు వాడు చూసి 'ఏయ్! ఎందుకు ఉరిపోసుకొన్నావు?' అని బయటికి తీశాడట."

"ఊఁ"

"నా బిడ్డలకూ నాకూ కట్టుకోటానికి గుడ్డ, తినడానికి అన్నంలేదు. మంత్రులకు ఎన్నో అర్జీలు పెట్టుకొన్నాను. వారేమీ చెయ్యలేదు. బ్రతకలేక ఉరి పెట్టుకొన్నాను—అన్నాడట వాడు."

"ఊఁ"

"అప్పుడు—'మాకూ అన్నంలేదు. మాకూ గుడ్డలేదు'—అని ప్రజలంతా గొల్లుమని గోల పెట్టారు"

"ఊఁ"

"ఆ గోలవిని నెహ్రూ పండితుడు బాధపడ్డాడు. ఆయనకి ఆవేశం వచ్చింది. ఆ కోపంతో అనారోగ్యంగా ఉన్నా, ఆయన—'మనుష్యుల్లారా, మనుష్యుల్లారా! ఈ గోల ఏమిటి?' అన్నాడు."

"ఊఁ"

"ఆకలికి ఆగలేని ఆ మనుష్యులు: 'ప్రభువులు లంచాలుతిని మాకు బియ్యం ఇవ్వడంలేదు. మేం మాడి చస్తున్నాం' అన్నారు.

"ఊఁ"

"ఆకలిగొన్న మనుష్యుల్లారా! మనుష్యుల్ని మాడ్చే ప్రభువుల్లారా!! బియ్యం ఎందుకని ఇవ్వలేదు? అన్నాడు."

"ప్రభువులు 'మమ్మల్ని నడిపించే మంత్రులు దొంగవ్యాపారులకు పర్మిట్లిచ్చి బియ్యం అంద

కుండా చేస్తున్నారు' అన్నారు."

"ఊఁ"

"ఆకలిగొన్న మనుషుల్లారా, మనుషుల్ని మాడ్చే ప్రభువుల్లారా, ప్రభువుల్ని నడిపే మంత్రుల్లారా! ప్రజలకు బియ్యం ఎందు కివ్వ లేదు? అన్నాడు."

"ఊఁ"

"మాటలు నేర్చిన మంత్రులు 'కేంద్రప్రభుత్వం మాకు బియ్య మివ్వలేదు' అన్నారు."

"ఊఁ"

" 'ఆకలిగొన్న మనుషుల్లారా, మనుషుల్ని మాడ్చే ప్రభువుల్లారా, ప్రభువుల్ని నడిపే మంత్రుల్లారా, బియ్య మివ్వలేని కేంద్రప్రభుత్వమా! ఈ గొడవేమిటి?' అన్నాడు."

"ఊఁ"

"అన్నంపెట్టడం చాతకాని కేంద్రప్రభుత్వం, 'భూకంపా లొచ్చినై, వర్షాలు కురియ లేదు, తుఫాను వీచింది. రాష్ట్రాలు సహకరించ లేదు' అన్నది."

"ఊఁ"

" 'ఆకలిగొన్న మనుషుల్లారా, మనుషుల్ని మాడ్చే ప్రభువుల్లారా, ప్రభువుల్ని నడిపే మంత్రుల్లారా! పాడి ఆవులాంటి భారతదేశంలో అన్నం లేకుండా ఎందుకు పోవాలి?' అన్నాడు."

"ఊఁ"

"అప్పుడా మంత్రిపుంగవులు, 'అది మాకేం తెలుసు మమ్మల్ని చేసిన ఎసెంబ్లీ మెంబర్ల నడుగు' అన్నారు."

"ఊఁ"

"ఆకలిగొన్న మనుషుల్లారా, మనుషుల్ని మాడ్చే ప్రభువుల్లారా, ప్రభువుల్ని నడిపే మంత్రుల్లారా, మంత్రుల్ని చేసే ఎసెంబ్లీ మెంబర్లారా! భారతంలో కరువెందు కొచ్చింది?" అన్నాడు.

"ఊఁ"

" మెంబర్లు, ' మాకేం తెలుసు, మమ్మల్ని ఎన్నుకొన్న వోటర్లనడుగు' అన్నారు."

"ఊఁ"

"ఆకలిగొన్న మనుషుల్లారా, మనుషుల్ని మాడ్చే ప్రభువుల్లారా, ప్రభువుల్ని నడిపే మంత్రుల్లారా, మంత్రుల్ని చేసిన మెంబర్లారా, మెంబర్ల నెన్నుకొన్న ఓటర్లారా, భారతంలో కరువెందు కొచ్చింది?" అన్నాడు.

"ఎందుకు వచ్చిందమ్మా!"

"చెబుతున్నా గా. ఈ ముద్ద మ్రింగనీమరి. ఆఁ, అప్పుడు. కట్టు గుడ్డలేని వోటర్లు, నోట మాటరాని వోటర్లు, బక్క చిక్కిన వోటర్లూ అంతా చేరి, "అసంగతులు మాకేం తెలుసు, మా వూరి రెడ్డిగారు గీసిన గీత దాటితే మా గుడిసెలు తగలడతాయి; మా కర్ణంగారి కెదురాడితే, మా చేలి గనిమలు తెగిపోతాయి; మా ఊరి పెద్ద రైతును కాదంటే, మా గొడ్లు కబేళాకు చేరిపోతాయి. మా పట్టపు బురఖా పెద్దలకు ఎదురు చెబితే మా కొంపలు దోయించేస్తారు; మా బొంద్రదొర మాటదాటితే మా తలకాయలు పగులుతాయి; టోపి పెట్టుకొన్న వాకంతా కాంగరేసంట, వారుమమ్మల్ని పచ్చ పెట్టెలో కాగితాలు ఏయండ్రా! అంటే ఏసేశాం. అంతేగాని ఈ కరువు సంగతి మాకేం తెలుస్తాది బాబయ్యా!" అన్నారు.

"ఊఁ"

"ఆకలిగొన్న మనుషుల్లారా, మనుషుల్ని మాడ్చే ప్రభువుల్లారా, ప్రభువుల్ని నడిపే మంత్రుల్లారా, మంత్రుల్ని చేసిన మెంబర్లారా, మెంబర్లను ఎన్నుకొన్న వోటర్లారా, అమాయకులచేత బలవంతంగా కాంగ్రెస్ పేరుతో వోట్లు వేయించిన టోపి, గూండా, దొంగల్లారా! భారతంలో ఈకరు వెందుకొచ్చింది?" అన్నాడు.

"ఊఁ"

"ఆనేసరికి, మీసం దువ్విన మురా నాయకులూ, బ్లాకులో బొంద్రలు పెంచిన పర్మిట్ దార్లు, కండలు పెంచి కర్రలు త్రిప్పే మదోన్మాదులూ, పట్టపగలే లూటీచేసే గజదొంగలూ, 'కరువా? భారత ప్రజా ప్రతినిధులం మమ్మల్ని చూడు. కరువెక్కడుంది. అహ్హహ్హా!' అన్నారు. అదిమాచి నెహ్రూ పండితుడు కొరియా సమస్య పరిష్కరించడానికని ఢిల్లీకి పరుగెత్తాడు.

ఈ లోక మెరుగని శారద ఫక్కున నవ్వింది. బిడ్డను లాలించి అన్నం తినిపించిన తల్లిహృదయం కంట నీరు పెట్టింది.